నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 1 డిసెంబర్ 2024 | SIDDIPET

వైకుంఠధామాలను అద్భుతంగా తీర్చిదిద్దాం

ప్రశాంత్‌నగర్ వైకుంఠధామంలో మార్నింగ్ వాక్ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మార్నింగ్ వాక్, యోగా, సమావేశాలు చేసుకునేలా వైకుంఠధామాలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 30: వైకుంఠధామాలను అద్భుతంగా తీర్చిదిద్దామని, అంతిమ సంస్కారాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగేలా సిద్దిపేటలోని వైకుంఠధామాలను అభివృద్ధి చేశామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట బైపాస్ రోడ్డు ప్రశాంత్ నగర్ పరిధిలోని వైకుంఠధామాన్ని సందర్శించి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేట వైకుంఠధామాన్ని రూ. 2 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. దుర్వాసన, అపరిశుభ్రతతో ఉన్న శ్మశాన వాటికలను సంస్కారవంతంగా తీర్చిదిద్దామన్నారు. ఇది వైకుంఠధామం కాదు.. ఒక పార్క్ మాదిరిగా తయారు చేసుకున్నామని చెప్పారు. రోజూ మార్నింగ్ వాక్, యోగా, సమావేశాలు జరుపుకునేందుకు వీలుగా అభివృద్ధి చేసుకున్నట్లు చెప్పారు. అంతిమ సంస్కారానికి వచ్చేవారు బాధను మరిచిపోయే విధంగా ఒక ఆహ్లాద భరిత వాతావరణం ఉండేలా వైకుంఠధామం ఉన్నదన్నారు. నిర్వహణ చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. వారికి కొన్ని సూచనలు చేశారు. ప్రజలకు అవసరమయ్యే విధంగా అన్ని వసతులు ఉండేలా చూడాలని చెప్పారు. వైకుంఠధామం కమిటీ అధ్యక్షుడిని, సభ్యులను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. స్వచ్ఛందంగా మీరు చేస్తున్న సేవ ఎంతో పుణ్యమని, మీకు సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, పాల సాయిరాం, కౌన్సిలర్లు విరోభా, ఆరవింద్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

వంటలను పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 30: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శనివారం కొండపాక మండల కేంద్రంలోని రాజీవ్ రహదారి పక్కనున్న మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్ షెడ్, కూరగాయలు, బియ్యం, పప్పులు, ఇతర సామగ్రిని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. సాయంత్రం స్నాక్స్‌లో భాగంగా అటుకులను రుచి చూశారు. వంట విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని సిబ్బందిని హెచ్చరించారు.

నా జన్మ ధన్యమైంది..

మానవ సేవ మాటల్లోనే విన్నా.. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నా..

గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారితో మాజీ మంత్రి హరీశ్‌రావు

- ఇంత గొప్ప అనుభూతి ఏ పదవిలో కలగలేదు..
- ప్రభుత్వం కన్నా గొప్పగా సత్యసాయి సేవలు
- నాడు దవాఖాన ఏర్పాటు చేయాలని కోరా... నేడు పిల్లల పాలిట సంజీవనిగా మారింది..
- ప్రపంచ స్థాయి వైద్యంతో పిల్లలకు పునర్జన్మ
- ఇది నిజంగా సత్యసాయి ఇచ్చిన వరం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా కొండపాక సత్యసాయి సంజీవని దవాఖానను సందర్శించిన మాజీమంత్రి హరీశ్‌రావు



సత్యసాయి సంజీవని దవాఖానలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న చిన్నారులతో హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, రమణాచారి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 30: నిజంగా ఈరోజు నా జన్మ ధన్యమైందని... గుండె జబ్బులతో బాధపడే చిన్నారులకు ఆపరేషన్ చేసి పునర్జన్మను ప్రసాదిస్తున్న సత్యసాయి సంజీవని సేవలో నేను కూడా భాగమైనందుకు నా మనస్సు తృప్తితో నిండిపోయిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం కొండపాక శివారులోని సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సత్యసాయి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు రోజులుగా ఓపెన్ హార్ట్ సర్జరీ పూర్తి చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులైన చిన్నారులను, వారి తల్లిదండ్రులను హరీశ్‌రావు ఆత్మీయంగా పలకరించారు. వారి యోగక్షేమాలను, సత్యసాయి ట్రస్ట్ ద్వారా అందిన వైద్యసేవలు, సౌకర్యాలను తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మానవ సేవే.. మాధవసేవ అనే మాటను మాటల్లోనే విన్న, కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నానని పేర్కొన్నారు. భగవాన్ మధుసూదనా సాయి, ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు, కేవీ రమణాచారి విజ్ఞప్తి మేరకు కళాశాల వార్షికోత్సవానికి వచ్చానని, అదే సమయంలో సత్యసాయి ట్రస్ట్ ద్వారా వైద్యసేవలను అందించాలని భగవాన్ సత్యసాయిని కోరానని తెలిపారు. గుండె జబ్బులతో బాధపడే చిన్నారుల కోసం వైద్యం అందించే దవాఖానను ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని దేశంలో ఐదో చైల్డ్ కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఇక్కడ నిర్మించారన్నారు. అప్పుడు ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రిగా ఉన్న నేను నా వంతుగా దవాఖానకు అవసరమైన అనుమతులు ఇప్పించడంతో పాటు, నా శక్తి మేరకు భాగస్వామిగా అయ్యానన్నారు. అలాంటి దవాఖాన నేడు పిల్లల పాలిట సంజీవనిగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ఇంత గొప్ప అనుభూతి ఏ పదవిలో కలుగలేదని, తనకు ఇంత అదృష్టాన్ని కలుగజేసిన భగవాన్ మధుసూదనా సాయికి రుణపడి ఉంటామన్నారు. దవాఖాన ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారిని హరీశ్‌రావు అభినందించారు. అంతకు ముందు ఆనంద నిలయం ఆవరణలో ఉన్న ఉమా మహేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బొడ్డుల కనకయ్య, రాధాకిషన్‌రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఈజీఎస్ స్టేట్ మాజీ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణారవీందర్, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు దేవీరవీందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, రైతుబంధు మాజీ మండల కో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా..

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన ఆర్ఎంపీలు

- వైద్యాధికారుల వేధింపులపై మాజీమంత్రి హరీశ్‌రావును కలిసిన సిద్దిపేట ఆర్ఎంపీలు

సిద్దిపేట, నవంబర్ 30: ఆర్ఎంపీలను వేధిస్తున్న వైద్యాధికారులపై అసెంబ్లీలో చర్చిస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట ఆర్ఎంపీలు మాజీమంత్రి హరీశ్‌రావును కలిసి వారి సమస్యలను వివరించారు. దవాఖానల తనిఖీ పేరిట వైద్యాధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీలో మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాట్లాడుతానని, ఉన్నతాధికారులతో కూడా మాట్లాడి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆర్ఎంపీలు కూడా నిబంధనలు అతిక్రమించకుండా చూసుకోవాలని హితవు పలికారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

- టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు థామస్‌రెడ్డి

ఎంపీ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న థామస్‌రెడ్డి తదితరులు

హుస్నాబాద్, నవంబర్ 30: ఆర్టీసీ ఉద్యోగులు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలని టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు థామస్‌రెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న మడప ప్రభాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ, వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగిగా 37ఏండ్లు సేవలందించడంతో పాటు టీఎంయూ ఆవిర్భావం నుంచి సంఘం బలోపేతానికి, కార్మికుల హక్కుల సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో ఎంపీరెడ్డి చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు జరుగుతాయని, యూనియన్లతోనే కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. యూనియన్ బలోపేతానికి సభ్యులు ఎల్లవేళలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎంయూ నిరంతరం ముందుంటుందన్నారు. అనంతరం ఎంపీరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. డీఎం వెంకటేశ్వర్లు, టీఎంయూ నాయకులు యాదగిరి, రాములు, పరమేశ్వర్, జీఆర్‌కే రావు, పూదరి శ్రీనివాస్, జేఆర్‌రెడ్డి, సురేశ్, చుక్క తిరుపతిరావు, డిపో అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు ఉన్నారు.

సమన్వయంతో పని చేయాలి

సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

మాట్లాడుతున్న సిద్దిపేట అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 30: రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రహదారుల వెంట స్పీడ్‌బ్రేకర్లు, చెట్లపొదలు లేకుండా తొలిగించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించడంతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో వాహనాలు ఆపకుండా ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్వహించే బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల్లో డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ మనోహర్, ఏసీపీ మధు, జిల్లా వైద్యాధికారి పల్వన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి

టోప్యానాయక్ తండాలో ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

ఝరాసంగం, నవంబర్ 30: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం భోజ్యానాయక్ పంచాయతీ పరిధిలోని టీప్యానాయక్ తండాలో తాగునీటి ఎద్దడి ఏర్పడి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తండాలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నా ఫలితం లేకుండా పోయింది. నెల నుంచి తాగునీటికి ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

సమస్యల వలయంలో మైనార్టీ బాలికల గురుకులం

- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని భోజనం
- శానిటేషన్ నిర్వహణలో విఫలం
- జూన్ నుంచి బడ్జెట్ విడుదల చేయని ప్రభుత్వం

సిద్దిపేటలో తలుపులు ఊడిపోయి ఖాళీగా ఉన్న స్నానాల గదులు

అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల ఆవరణ

సిద్దిపేట, నవంబర్ 28: ప్రభుత్వ అలసత్వం కారణంగా గురుకుల పాఠశాలలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. జూన్ నుంచి పాఠశాలల నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయకపోవడంతో గురుకులాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ఇబ్బందిగా మారింది. ఇందుకు నిదర్శనం సిద్దిపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల. పాఠశాలలో శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా మారింది. బాలికలు వాడుతున్న శానిటేషన్ ప్యాడ్స్ రెండు,మూడు రోజుల వరకు వాష్ రూమ్‌ల వద్దనే డస్ట్ బిన్‌లో ఉంటున్నాయి. కనీసం వాటిని మున్సిపల్ వాహనాలకు సైతం అందించేవారు లేకుండా పోయారు. విద్యార్థులు స్నానాలు చేయడం కోసం ఏర్పాటు చేసిన గదులు తలుపులు ఊడిపోయి దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు చలికాలం కావడంతో గ్లీజర్లు సరిగా పని చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శానిటేషన్ నిర్వహణ సరిగా లేకపోవడంతో వ్యాధులు ప్రబలి, విద్యార్థులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

మెనూ ప్రకారం అందని భోజనం

పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం నాసిరకంగా మారింది. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. కూరగాయల్లో నాణ్యత లేదు. తాజా కూరగాయలతో భోజనం అందించాలని ప్రభుత్వం చెబుతున్నా అందుకు అనుగుణంగా భోజనం పెట్టడం లేదు. కూరగాయలు కూడా పూర్తిగా పాడైనవి పెడుతున్నారు. ఈ విషయంపై వార్డెన్‌ను ఆడగ్గా కూరగాయలు సరఫరా చేసే గుత్తేదారుకు ఎన్నిసార్లు చెప్పినా వినటం లేదని, దీంతో రోజూ కూరగాయలను తిప్పి పంపిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల భోజన సమయంలో మార్పులు చేయడంతో చాలామంది విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉదయం 7 గంటలకు అల్పాహారాన్ని అందిస్తున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు ఉదయాన్నే నిద్ర లేచి రెడీ అయ్యే సరికి అల్పాహారం టైం అయిపోతుంది. రాత్రి పూట భోజనం 6 గంటలకు పెడుతుండడంతో విద్యార్థులు మరుసటి రోజు ఉదయం 7గంటల వరకు అల్పాహారం అందించడం వల్ల, సుమారు 12 గంటల పాటు వారికి ఎలాంటి ఆహారం అందకపోవడంతో చాలామంది ఎసిడిటీ సమస్యను ఎదుర్కొంటున్నారు. డార్మెటరీ రూముల్లో ఫ్యాన్లు నడవక, వాటిని రిపేరు చేయించే వారు లేక విద్యార్థులు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో నీటి సరఫరా పైపులు లీకేజీ కావడంతో చిత్తడిగా కనిపిస్తుంది.

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారం రోజుల్లో పరిష్కరించేలా కృషి చేస్తాం, బడ్జెట్ రిలీజ్ కాకపోవడంతో హాస్టల్లో ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సమస్యలు పరిష్కరించడంలో ఆలస్యమైంది. విద్యార్థులకు అందించే భోజనంలో నాసిరకం కూరగాయలు సప్లయ్ చేస్తున్న కాంట్రాక్టర్‌ను రిజెక్ట్ చేశాం.
–ఆస్మా ఫాతిమా, ప్రిన్సిపాల్

మురుగుతో తప్పని పాట్లు

దిగ్వాల్ బడి పక్కన పారుతున్న డ్రైనేజీ .. కాల్వలు లేక దుర్వాసన

దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద దుర్వాసనను వెదజల్లుతున్న మురుగు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు

కోహీర్, నవంబర్ 30: ఆహ్లాదకర వాతావరణంలో విద్యనభ్యసించాల్సిన విద్యార్థులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలతో రోగాలబారిన పడుతున్నారు. ప్రహరీ నిర్మించి ఏడేండ్లు గడిచినా ఇంతవరకు మురుగు కాల్వ నిర్మించలేదు. దీంతో మురుగంతా అక్కడే నిల్వ ఉండడంతో ఇబ్బందులుకు గురవుతున్నామని మండలంలోని దిగ్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో ఏడేండ్ల క్రితం 65వ జాతీయ రహదారి నిర్మించారు. పాఠశాలకు ప్రహరీని కూడా ఏర్పాటు చేయించారు. తరగతి గదులు కూడా సమీపంలో ఉండడంతో వారి కష్టాలు వర్ణణాతీతం. పలు ఇండ్లలో నుంచి వచ్చే మురుగు గ్రామం బయటకు తరలించకుండా అధికారులు చేతులెత్తేశారు. తమకేమీ పట్టనట్లు చూస్తుండిపోయారు. పాఠశాల ప్రవేశ ద్వారం సమీపంలోనే ఇలాంటి దుస్థితి ఉండడంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. మురుగుతో తడిసిన గోడ ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో దోమలు, ఈగల బెడద నుంచి తట్టుకోలేకపోతున్నామని చెబుతున్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ, విద్యా శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. జిల్లా అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మురుగు కాల్వ నిర్మించాలి

దిగ్వాల్ గ్రామంలోని జాతీయ రహదారి పక్కన ఇరువైపులా మురుగు కాల్వలను నిర్మించాలి. ఇండ్లలో వాడిన నీరంతా పాఠశాల ప్రహరీ వద్ద నిలిచి ఉండడంతో దుర్వాసన వస్తున్నది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేటప్పుడు దుర్వాసన, ఈగలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సమస్యను గుర్తించి పరిష్కార మార్గం చూపాలి.
– నారాయణరెడ్డి, దిగ్వాల్, కోహీర్

దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద దుర్వాసనను వెదజల్లుతున్న మురుగు

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



హైలెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, నవంబర్ 30: ప్యారవరం గ్రామ శివారులో పీఆర్ఆర్ నిధులతో మంజూరైన హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్‌లతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను తొలిగించడానికి రూ.3 కోట్లతో హైలెవల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. మహిళాలకు అన్ని రంగాల్లో భాగస్వాములను చేస్తున్నామని, మండల సమాఖ్య తరపున మంజూరైనా పెరటి కోళ్ల యూనిట్, మదర్ యూనిట్, న్యూ ఎంటర్‌ప్రైజెస్, పీఎంఎఫ్ఈ పథకాల చెక్కులను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ జంగారెడ్డి, తహసీల్దార్ తిరుమలరావు, నాయబ్ తహసీల్దార్ యాసిన్‌ఖాన్, ఎంపీడీవో సుధాకార్, ఏపీఎం టిక్యా నాయక్, ఏపీవో రాజ్‌కుమార్, హన్మంత్‌రావు పాటిల్, వెంకటేశం, దేవదాస్, ఉజ్వల్ రెడ్డి, తన్వీర్, మల్లన్న పాటిల్, ఉదయ్ శంకర్ పాటిల్, నరేశ్ గౌడ్, అశ్విన్ పాటిల్, శంకర్ పాటిల్, జగదీశ్, ఎజాజ్ బాబా, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ ఫైల్స్ వెతుకులాటలో..

- ఇటీవల మల్లన్న ఆలయంలో మాయమైన ఆడిట్ ఫైళ్లు
- ముగ్గురు ఆలయ ఉద్యోగులకు ఈవో నోటీసులు
- వాయిదాపడిన అదనపు కమిషనర్ విచారణ

చేర్యాల, నవంబర్ 30: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గల్లంతైన ఆడిట్ ఫైల్స్ కోసం నోటీసులు అందుకున్న ముగ్గురు ఉద్యోగులు రెండు రోజులుగా కార్యాలయంలో వెతుకుతున్నారు. రూ.3 కోట్ల విలువైన ఆడిట్ అభ్యంతరాలకు సంబంధించిన ఫైల్స్ ఆలయ కార్యాలయంలో కనిపించకుండా పోవడంతో ఈవో ఇటీవల ముగ్గురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఆ ఉద్యోగులు రెండు రోజులుగా ఆడిట్ ఫైల్స్‌ను దొరకబట్టే పనిలో నిమగ్నమయ్యారు. దేవాదాయ శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ కృష్ణవేణి దీనిపై విచారణ జరిపేందుకు శనివారం ఆలయానికి రావాల్సి ఉండగా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక పనులు ఉండడంతో సదరు అధికారి పర్యటన వాయిదా పడింది. దీంతో మల్లన్న ఆలయ ఉద్యోగులు కొంత మేర ఊపిరి పీల్చుకున్నారు. మల్లన్న ఆలయానికి సంబంధించి రూ.3 కోట్లకు పైగా అభ్యంతరాలను రాష్ట్ర ఆర్థిక సంఘం ఆడిటర్ బృందం గుర్తించి సంబంధిత శాఖతో పాటు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ప్రభుత్వ ఆర్థిక శాఖ ఆడిటర్ లక్ష్మీనారాయణ 2018లో వారంపాటు మల్లన్న ఆలయంలోని రికార్డులను పరిశీలించారు. 2014 ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2017 వరకు ఆలయ ఆదాయ, వ్యయాలకు సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎంబీ రికార్డులు లేని చిన్న మరమ్మతులు రూ.70.19లక్షలు, అనుమతి లేని ప్రహరీ నిర్మాణానికి రూ.20.91లక్షలు ఖర్చు చేసినట్లు, ఒరిజినల్ బిల్లులు లేని ఉద్యోగుల అడ్వాన్సులు రూ.14,84 లక్షలు, అతిథుల భోజనాల ఖర్చులు రూ.5.34 లక్షలు, వాహనాల అద్దె రూ.4.56 లక్షలు, దుస్తులకు ఖర్చులు రూ.13.96 లక్షలు, చెట్ల పెంపకానికి రూ.3.63 లక్షలు, వేలం పాటల బకాయిలు రూ.22.29 లక్షలు నిబంధనలకు విరుద్ధంగా ఆలయ సిబ్బంది బ్యాంకుల్లో చెక్కుల ద్వారా విడుదల చేసినవి రూ.33.26లక్షలతో పాటు రూ.లక్ష లోపు అనేక అంశాలకు అడిటర్ అభ్యంతరం తెలుపుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో కొందరు ఈవోలు వెంటనే స్పందించి ఎంబీ రికార్డులను సదరు అభ్యంతరాలకు చూపించడంతో పాలు బిల్లులు అందజేశారు. అయినప్పటికీ రూ.1.29కోట్లకు సంబంధించిన అభ్యంతరాలకు సరైన ఆధారాలు, సమాధానం లేకపోవడంతో పలువురు ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని కమిషనర్ మూడేండ్ల క్రితం ఉత్తర్వులు జారీ చేశాడు. కానీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల సదరు రికార్డుల విషయం వెలుగులోకి రావడంతో ఆడిట్ ఫైల్స్‌కు సంబంధించిన ఉద్యోగులకు ఈవో నోటీసులు జారీ చేయడంతో తిరిగి ఆడిట్ ఫైల్స్ కథ ముందుకు వచ్చింది.